క్లుప్తంగా

పంటల నమోదు తప్పనిసరి

బచ్చన్నపేట : పంటల సాగు వివరాలను సర్వే నంబర్ల వారిగా ఆయా క్లస్టర్ల వ్యవసాయ విస్తరణ అధికారుల వద్ద రైతులు నమోదు చేసుకోవాలని ఏఓ విద్యాకర్‌రావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వరితో పాటు పత్తి వివరాలను తప్పకుండా ఆన్‌లైన్‌లో నమోదు చేయించాలని సూచించారు. పత్తి పంటకు సంబంధించి పంటల సాగు నమోదు చేసుకోవడంతో పాటు కపాస్ కిసాన్ యాప్‌లో రిజిస్ట్రేషన్ ద్వారా స్లాట్ బుకింగ్ చేసుకున్న రైతులు కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా కొనుగోలు కేంద్రాల్లో విక్రయించుకునే అవకాశం ఉంటుందన్నారు. రైతులు తప్పనిసరిగా పంటల వివరాలను నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు.

అంగన్‌వాడీలో పోషణమాసం



స్టేషన్‌ఘన్‌పూర్ : మండలంలోని నిమిలిగొండ అంగన్‌వాడీ- 1వ సెంటర్‌లో మంగళవారం పోషణ మాస కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమాన్ని పంచాయతీ సెక్రటరీ జేఎస్ మణి ప్రారంభించారు. ఈ సందర్భంగా తల్లులకు ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు, పప్పులు, మిల్లెట్స్ గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ రజిత తదితరులు పాల్గొన్నారు.

'చర్య తీసుకోవాలి'

రఘునాథపల్లి : ఇసుక అక్రమ రవాణాను ప్రోత్సహిస్తూ, ఫిర్యాదు చేసినా పట్టించుకోకుండా విధి నిర్వహణలో నిర్లక్ష్యం చేస్తున్న స్థానిక తహసీల్దార్‌పై చర్యలు తీసుకోవాలని మండల కేంద్రానికి చెందిన సామాజిక కార్యకర్త ఠాకూర్ జ్ఞానేష్‌సింగ్ మంగళవారం కలెక్టర్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. రఘునాథపల్లి మండలంలో వాల్టా చట్టాన్ని ఉల్లంఘిస్తు భారీ ఎత్తున ఇసుక అక్రమ రవాణా అవుతోందని పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పేరిట లబ్ధిదారులకు కాకుండా ఇతర ప్రాంతాలకు తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారన్నారు. ఇసుక అక్రమ రవాణాపై పోలీసులు, తహసీల్దార్‌కు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. పలుమార్లు కలెక్టర్ కార్యాలయంలో ఫిర్యాదు చేశామని, అయినా ఎలాంటి చర్యలు తీసుకోలేదని తెలిపారు.

వైభవంగా అష్టదళ పాద పద్మారాధన పూజ



చిల్పూరు : బుగులు వేంకటేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం అర్చకులు వేదమంత్రాల నడుమ అష్టదళ పాద పద్మారాధన పూజ చేశారు. కార్యక్రమంలో ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్‌రావు-కిరణ్మయి దంపతులు, ఈఓ లక్ష్మీప్రసన్న, సూపరింటెండెంట్ వెంకయ్య, ధర్మకర్తలు, భక్తులు పాల్గొన్నారు.

పోటాపోటీగా ఆశావహులు

లింగాలఘణపురం : స్థానిక సంస్థల ఎన్నికల్లో బరిలో నిలిచేందుకు బీఆర్ఎస్ పార్టీ నుంచి అభ్యర్థులు పోటాపోటీగా ఉన్నారు. మంగళవారం మండలంలోని అన్ని గ్రామాల్లో మాజీ ఎమ్మెల్యే రాజయ్య ఆదేశాల మేరకు పార్టీ మండల అధ్యక్షుడు శ్రీనివాసు గ్రామాల్లో సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ అభ్యర్థులు జాబితాను తీసుకున్నారు. ఇందులో ఒక్కొక్క గ్రామంలో సర్పంచ్, ఎంపీటీసీలుగా పోటీ చేసేందుకు నాలుగైదు పేర్లు ఇచ్చారు. అదేవిధంగా జెడ్పీటీసీకి ఆరుగురు పోటీలో ఉంటామని తమ పేర్లను అందజేశారు. ఇలా గ్రామాల్లో స్థానిక సంస్థల ఎన్నికలకు బీఆర్ఎస్ అభ్యర్థులు పోటీ చేసేందుకు ఎంతో ఆసక్తితో ఉన్నారు.

ఎస్సైని కలిసిన నాయకులు



జఫర్‌గఢ్ : నూతన ఎస్సైగా బాధ్యతలు స్వీకరించిన బి.రామారావును సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు జువారి రమేశ్ ఆధ్వర్యంలో పార్టీ మండల నాయకులు మంగళవారం పోలీస్‌స్టేషన్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం ఎస్సైని శాలువా కప్పి సన్మానించారు.

అప్రమత్తంగా ఉండాలి

దేవరుప్పుల : పిల్లల ప్రవర్తనపై తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై ఊర సృజన్ కుమార్ మంగళవారం సూచించారు. ఏఎస్సై సదానందం, కానిస్టేబుళ్లు యాకేష్, యాకూబ్, అశోక్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

బియ్యం అందజేత

జఫర్‌గఢ్ : మండల కేంద్రానికి చెందిన బాషబోయిన అంజయ్య, చెరిపల్లి కొమురయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. దీంతో గ్రామానికి చెందిన పట్టపురి దాసుభాగ్యలక్ష్మి దంపతులు ఒక్కో బాధిత కుటుంబానికి 25కేజీల బియ్యాన్ని మంగళవారం అందజేశారు.

మోడల్ హౌస్‌లు సిద్ధం

- నియోజక వర్గానికి మంజూరైన ఐదింటిలో ఒకటి ప్రారంభం
- చివరిదశలో మరో నాలుగు ఇళ్లు



ప్లాస్టరింగ్ దశలో ఉన్న లింగాలఘణపురంలోని ఇందిరమ్మ నమూనా ఇల్లు

లింగాలఘణపురం : కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తోంది.. అందులో భాగంగా లబ్ధిదారులు రూ. ఐదు లక్షలతో సొంతింటిని ఏ విధంగా పూర్తి చేసుకోవచ్చో తెలియజేసేందుకు ప్రతీ మండల కేంద్రాల్లో మోడల్ హౌస్ ప్రభుత్వ పర్యవేక్షణలో నిర్మిస్తున్నారు. కాగా వీటి నిర్మాణాలు పూర్తి కావొస్తున్నాయి. ఇప్పటికే స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గ కేంద్రంలో ఎమ్మెల్యే కడియం శ్రీహరి చేతుల మీదుగా ఆగస్టులో ప్రారంభించారు. అదే విధంగా చిల్పూరు, రఘునాథపల్లిలో పూర్తి చేసి రంగులు కూడా వేయగా జఫర్‌గఢ్, లింగాలఘణపురం మండలాల్లో ప్లాస్టరింగ్ చేస్తున్నారు. రూ.5 లక్షలతో 22 ఫీట్ల పొడవు, 18 ఫీట్ల అడ్డం, 400 స్క్వేర్ ఫీట్లలో బెడ్రూం, హాలు, కిచెన్ మోడల్ ఇళ్లను నిర్మించారు. బేస్‌మెంట్ వరకు అంటే ఆఫ్ పిల్లర్ వేసి ఆ తర్వాత పిల్లర్లు లేకుండా గోడలు నిర్మించి స్లాబ్‌లు వేశారు. ఇలా ప్రభుత్వం ఇచ్చే రూ.5 లక్షలతో నిరుపేదలు ఏ విధంగా ఇల్లు నిర్మాణం చేసుకోవచ్చనే విషయాన్ని వారికి తెలిసే విధంగా చేపట్టారు. ప్రతీ మండల కేంద్రంలో ఒకటి నిర్మించి అందులోనే హౌజింగ్ ఏఈ కార్యాలయాలుగా వినియోగించుకోవాలని ప్రభుత్వం సూచించింది. ఈ నేపథ్యంలో రెండు మూడు నెలల్లోనే తక్కువ ఖర్చుతో ఇళ్లు నిర్మించి ప్రారంభోత్సవాలకు సిద్ధం చేస్తున్నారు.

త్వరలో పూర్తి చేస్తాం..

నియోజకవర్గంలో ఐదు మండలాల్లో నిర్మిస్తున్న ఇళల్లో స్టేషన్‌ఘన్‌పూర్‌లో మోడల్ హౌస్ ప్రారంభమైంది. మిగిలిన నాలుగు మండలాల్లో ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్నాయి. రంగులు వేసినవి రెండు, మరో రెండు ప్లాస్టరింగ్ దశలో ఉన్నాయి. త్వరలో పూర్తి చేసి నిరుపేదలు ప్రభుత్వం ఇచ్చే రూ.5 లక్షల్లో ఏ విధంగా నిర్మాణం చేసుకోవచ్చో చూపిస్తున్నాం.

- చంద్రశేఖర్, హౌసింగ్, డీఈ

గిరిజన పంచాయతీల సమగ్రాభివృద్ధికి కృషి

- ఎమ్మెల్యే యశస్విని రెడ్డి



ఎమ్మెల్యే సమక్షంలో పార్టీలో చేరుతున్న లక్ష్మణ్‌తండా బీఆర్ఎస్ నాయకులు

దేవరుప్పుల : గిరిజన తండాలను ప్రత్యేక పంచాయతీలుగా ఏర్పాటు చేసి విస్మరించిన బీఆర్ఎస్ ప్రభుత్వ మాదిరిగా కాకుండా గిరిజన జీపీల అభివృద్ధికి ప్రత్యేక నిధులు మంజూరు చేయించి సమగ్రాభివృద్ధికి పాటుపడుతామని పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని లక్ష్మణ్ తండాలో ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు సజ్జన్ నాయక్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకులు బానోత్ సుజాత, బానోత్ శోభ, భీమిలి, బీకోజీ తదితరులు కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రజల ఆశలను నెరవేర్చడంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్లప్పుడూ ముందుంటుందన్నారు. గామీణ ప్రాంతాల సంక్షేమం దిశలో మహిళా సాధికారత కోసం విరివిగా రుణాలు ఇచ్చామని, ఊరూరా నిలువనీడ లేని పేదలకు ఇప్పటికే తొలిదశలో ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశామన్నారు. స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్‌ను ఆదరిస్తే సమగ్రాభివృద్ధి అనివార్యమన్నారు. బోనగిరి యాకస్వామి, ఎస్టీ, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు సజ్జన్, నాగరాజు, గ్రామ అధ్యక్షుడు దంజ్యా నాయక్ పాల్గొన్నారు.

'కడియం'పై ఆరోపణలు మానుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న రాంబాబు, పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు

- గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ రాంబాబు

రఘునాథపల్లి : ఎమ్మెల్యే కడియం శ్రీహరిపై మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య నిరాధార ఆరోపణలు మానుకోవాలని, అలాగే వ్యవహరిస్తే ఇక సహించబోమని గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ మారుజోడు రాంబాబు హెచ్చరించారు. మంగళవారం మండల కేంద్రంలో కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు లింగాల జగదీశ్ చందర్‌రెడ్డితో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధిని జీర్ణించుకోలేకనే మాజీ ఎమ్మెల్యే రాజయ్య మతి భ్రమించి మాట్లాడుతున్నాడని విమర్శించారు. నియోజకవర్గంలో బీఆర్ఎస్‌ను నామారూపాలు లేకుండా చేసి స్థానిక ఎన్నికల్లో అన్ని జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లను కైవసం చేసుకొని కాంగ్రెస్ సత్తాను చూపిస్తామన్నారు. మండలంలోని శివాజీనగర్, మల్లంపల్లి గ్రామాలకు చెందిన 30 కుటుంబాలు బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరగా వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కోళ్ల రవిగౌడ్, నాయకులు పోకల శివకుమార్, ఎండీ బాషుమియా, గాదె మహేందర్‌రెడ్డి, నామాల బుచ్చయ్య, లోనె శ్రవణ్, కడారి రవి, కొలిపాక మల్లేష్, రంగోజు ఈశ్వరయ్య, యాకూబ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ పత్తి దినోత్సవం



రైతులకు అవగాహన కల్పిస్తున్న మారి ప్రతినిధులు

తరిగొప్పుల : మారి సంస్థ ఆధ్వర్యంలో ప్రపంచ పత్తి దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని అక్కరాజుపల్లిలో తరిగొప్పుల పీయూ కోఆర్డినేటర్ జంగిటి సాగర్ ప్రపంచ వ్యాప్తంగా పత్తి పంటకు ఉన్న ప్రాధాన్యం పై క్షేత్రస్థాయిలో రైతులకు అవగాహన కల్పించారు. ప్రపంచ వ్యాప్తంగా 100 కోట్ల మంది ప్రజలకు పత్తి పంట జీవనోపాధి కల్పిస్తోందన్నారు. వస్త్ర పరిశ్రమ, నూనె, పశుగ్రాసం అనేక అనుబంధ ఉత్పత్తుల ద్వారా ఆర్థిక వ్యవస్థకు పత్తి వెన్నెముకగా నిలుస్తోందన్నారు. ఐక్యరాజ్య సమితిచే గుర్తించబడిన ప్రపంచ పత్తి దినోత్సవం పత్తి రైతులకు, పత్తి రంగంలోని కార్మికులకు గౌరవాన్ని, మద్దతును అందించడానికి ఒక వేదిక అన్నారు. మారి ఆర్గనేజేషన్ ప్రతినిధులు పరశురాములు, రాకేష్, ప్రేమలత, రజని, భాస్కర్, నరేష్ రైతులు పాల్గొన్నారు.

సామగ్రి బహూకరణ



పాలకుర్తి టౌన్ : మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలకు రూ.6వేల విలువైన సామగ్రి (మార్చ్ ఫాస్ట్, డ్రమ్స్) ని మంగళవారం హనుమకొండకు చెందిన మంద రఘుపతి జ్ఞాపకార్థం వారి అల్లుడు కమటం శ్రీనివాస్, శ్రీలత బహూకరించారు. ఎంఈఓ పోతుగంటి నర్సయ్య సమక్షంలో సామగ్రిని ప్రధానోపాధ్యాయుడు చిదురాల శ్రీనివాస్‌కు అందజేశారు. ఉపాధ్యాయులు విజయ్‌కుమార్, శ్రీనివాస్, శ్రీలత, మంజుల, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్‌పర్సన్ శ్రీలత, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా వాల్మీకి జయంతి



పాలకుర్తి టౌన్ : మండలంలోని వల్మిడి శ్రీరామాలయంలో, మునుల గుట్టపై వాల్మీకి జయంతి వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. వాల్మీకి విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వల్మిడి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన జయంతి వేడుకల్లో చరిత్ర పరిశోధకుడు కేవీజీకే ఆచార్య మాట్లాడారు. వాల్మీకి అందించిన మానవీయ విలువలు, ధర్మ ఆచరణ నేటి సమాజానికి ఎంతో అవసరం అన్నారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు సీహెచ్ కళ్యాణ సుందరం, తాళ్ల సోమనారాయణ, చిలుకమారి సోమేశ్వర్, మొకాటి కుమార్, చిన్న సోమయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ పార్టీ సత్తాచాటాలి



కొడకండ్ల: బీఆర్ఎస్‌లో చేరిన వారితో రామోజీ



దేవరుప్పుల: మాట్లాడుతున్న దయాకర్

కొడకండ్ల : స్థానిక సంస్థల ఎన్నికల్లో కొడకండ్లలో మెజార్టీ స్థానాల్లో బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించి సత్తా చాటాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సిందె రామోజీ కోరారు. మంగళవారం లక్ష్మక్కపల్లి, పెద్దబాయితండా, రామన్నగూడెం, బోడోనికుంట తండా, సీఎం, నీలిబండతండా, మొండ్రాయి, గిర్నితండా, ఎంసీ తండా, రామవరం, రామేశ్వరం గ్రామాల్లో నిర్వహించిన పార్టీ సమావేశాల్లో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ వైఫల్యాలను ప్రజలకు వివరించి వారిని చైతన్యపర్చి బీఆర్ఎస్ అభ్యర్థుల గెలుపునకు పార్టీ శ్రేణులు సైనికుల్లా పనిచేయాలన్నారు. ఈ సందర్భంగా లక్ష్మక్కపల్లి గ్రామానికి చెందిన పలువురు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. నాయకులు వెంకటేశ్వర్‌రావు, రాము, కృష్ణమూర్తి, జ్యోతి, సోమరాములు, సత్యనారాయణ, రాజిరెడ్డి, ప్రభాకర్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

స్థానికంలో బీఆర్ఎస్‌కు పూర్వవైభవం..

దేవరుప్పుల : స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు పూర్వవైభవం తీసుకురావాలని బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు తీగల దయాకర్ పిలుపునిచ్చారు. మంగళవారం మండలంలోని స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలుపు కోసం గ్రామ పార్టీ అధ్యక్షుడు తాటిపెల్లి మహేష్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఉద్యమాల గడ్డ కడవెండిలో సమగ్రాభివృద్ధి చేసిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. ప్రతి గ్రామ పంచాయతీ పురోగతి విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్య పొందిందని ఆరోపించారు. 420 హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలన్నారు. స్థానికత ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను గెలిపిస్తే రేవంత్‌రెడ్డి సర్కారుకు కనువిప్పు కలుగుతుందన్నారు. సమావేశంలో బస్వ మల్లేశం, మండల ప్రధాన కార్యదర్శి చింత రవి, వర్కింగ్ ప్రెసిడెంట్ రామ్‌సింగ్, అధికార ప్రతినిధి హన్మంతు, రత్నాకర్ రెడ్డి, పీఏసీఎస్ వైస్ చైర్మన్ రమేష్, సాయిలు, బాలు, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన శరత్కాల మహోత్సవాలు



పూర్ణాహుతి నిర్వహిస్తున్న వేదపండితులు



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

కొడకండ్ల : మండల కేంద్రంలోని యోగలింగేశ్వర సహిత రాజరాజేశ్వరి ఆలయంలో శరత్కాల మహోత్సవాలు మంగళవారం ముగిశాయి. సిద్ధాంతి పాలకుర్తి నృసింహారామశర్మ ఆధ్వర్యంలో ఆరంభమైన ఉత్సవాలు అతని కుమారుడు ఆలయ నిర్వాహకుడు పాలకుర్తి సుధాకరగౌతం శర్మ కొనసాగిస్తున్నారు. పదిహేను రోజుల పాటు పంచామృత అభిషేకాలు, కుంకుమ పూజలు నిర్వహించారు. చివరి రోజు వేదపండితుడు తాటిపాముల నర్సింహ్మమూర్తి ఆధ్వర్యంలో పూర్ణాహుతి, అమ్మవారికి ప్రత్యేక అర్చనలు చేసి అమ్మవారిని అలంకరించారు. కార్యక్రమానికి హాజరైన భద్రకాళి ఆలయ చైర్మన్ డాక్టర్ శివసుబ్రమణ్యం మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా ఎన్నో ఆలయాల ప్రతిష్ఠ కార్యక్రమాలను నిర్వహించి మాజీ సీఎం కేసీఆర్‌చేత పల్లకి సేవ చేయించుకొన్న ఘనత సిద్ధాంతి నృసింహారామశర్మకే దక్కుతుందన్నారు. ఈ ప్రాంత ఖ్యాతిని, కీర్తిని ఇనుమడింపజేశాడన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని వివిధ ప్రాంతాలతో పాటు సిద్దిపేట, హైదరాబాద్ తదితర ప్రాంతాల నుంచి వేదపండితులు, భక్తులు అధికసంఖ్యలో హాజరు కాగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు.

సీపీఐ అభ్యర్థులను గెలిపించాలి



సమావేశంలో మాట్లాడుతున్న యాదగిరి

రఘునాథపల్లి : స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజల పక్షాన పోరాటం చేసే సీపీఐ అభ్యర్థులను గెలిపించాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు, మండల కార్యదర్శి కావటి యాదగిరి పిలుపునిచ్చారు. మంగళవారం మండలంలోని శ్రీమన్నారాయణపురంలో నిర్వహించిన సీపీఐ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజా సమస్యలే ఎజెండాగా పోరాడుతున్న సీపీఐ నాయకులను ఆదరించాలన్నారు. సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానాల్లో అభ్యర్థుల గెలుపునకు కలిసికట్టుగా పని చేయాలని ఆయన సూచించారు. మరాఠి యాదగిరి, చంద్రమౌళి, తూడి శ్రీనివాస్, భిక్షపతి, రెయిన్‌బాబు, లింగాల రాములు, ఇటుకల అనుమాజి, కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.

సీజేఐ గవాయ్‌పై దాడి అమానుషం



జనగామ రూరల్: నిరసన వ్యక్తం చేస్తున్న అంబేడ్కర్ యువజన, ప్రజాసంఘాల నాయకులు



స్టేషన్‌ఘన్‌పూర్: అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న ఎమ్మార్పీఎస్ నాయకులు



స్టేషన్‌ఘన్‌పూర్: కోర్టు వద్ద మాట్లాడుతున్న రమేశ్



జనగామ రూరల్: సమావేశంలో మాట్లాడుతున్న బీఎస్పీ నాయకుడు మల్లయ్య

జనగామ రూరల్ : సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి బీఆర్ గవాయ్‌పై జరిగిన దాడి అమానుషమని అంబేడ్కర్ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అవిలయ్య అన్నారు. దాడిని ఖండిస్తు అంబేడ్కర్ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు కన్నారపు శివశంకర్ ఆధ్వర్యంలో ప్లకార్డులతో మంగళవారం పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చీఫ్ జస్టిస్ గవాయ్‌పై జరిగిన దాడి యావత్ దళిత సమాజంపై జరిగిన దాడిగా పేర్కొన్నారు. న్యాయవాద వృత్తిలో ఉండి రాకేశ్ కిశోర్ మతోన్మాదంతో సర్వోన్నత న్యాయ వ్యవస్థపై దాడి చేయడం సిగ్గుమాలిన చర్య అని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే నిందితుడిని దేశద్రోహిగా ప్రకటించి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. లేనిచో ప్రజాస్వామిక వాదులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. న్యాయవాది సాదిక్ అలీ, ప్రముఖ వైద్యుడు సీహెచ్ రాజమౌళి, డాక్టర్ సుగుణాకర్ రాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి బండారి నర్సింగరావు, వాంకుడోత్ అనిత, మేకల శంకరయ్య, కన్నారపు పరశురాములు, గద్దల కిశోర్, బొట్ల మహేష్, ఎండబట్ల భాస్కర్, నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

కఠిన చర్యలు తీసుకోవాలి

జస్టిస్ బీఆర్ గవాయ్‌పై న్యాయవాది దాడి చేయడాన్ని బహుజన్ సమాజ్ పార్టీ తీవ్రంగా ఖండిస్తోందని ఆ పార్టీ జిల్లా ఇన్‌చార్జ్ జెరిపోతుల మల్లయ్య అన్నారు. మంగళవారం పట్టణంలో తాండ్ర లావణ్య అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. జిల్లా అధ్యక్షుడు మడిపడిగ చంద్రశేఖర్, చిలుముల అర్జున్, తాండ్ర సిద్దులు తదితరులు పాల్గొన్నారు.

విధులు బహిష్కరించిన న్యాయవాదులు

స్టేషన్‌ఘన్‌పూర్ : సుప్రీం కోర్టు చీఫ్ జస్టిస్ బీఆర్ గవాయ్‌పై సోమవారం జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తూ మంగళవారం స్టేషన్‌ఘన్‌పూర్ కోర్టు న్యాయవాదులు విధులు బహిష్కరించారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కనకం రమేశ్ మాట్లాడుతూ ప్రధాన న్యాయమూర్తి పై జరిగిన దాడి భారత న్యాయ వ్యవస్థపైనే జరిగిన దాడిగా భావిస్తున్నామన్నారు. ఉపాధ్యక్షుడు మునుగాల రవీందర్, జాయింట్ సెక్రటరీ మారపాక లక్ష్మణ్, లైబ్రరీ సెక్రటరీ అమరోజు శ్రీనివాస్, ఎగ్జిక్యూటివ్ మెంబర్ శ్రీశైలం, న్యాయవాదులు జోగు సంపత్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో..

ప్రధాన న్యాయమూర్తిపై జరిగిన దాడికి నిరసనగా స్టేషన్‌ఘన్‌పూర్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో నల్ల జెండాలు ధరించి నిరసన తెలిపారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాగ్గళ్ల ఉపేందర్, ఎంఎస్పీ మండల అధ్యక్షుడు గాదె శ్రీధర్, ఏనలిమెల నాగరాజు, చాడ ఏలియా, మంద శ్రీనివాస్, యాకస్వామి, బాల స్వామి, ఇసురం శ్రీను, రాజశేఖర్, శ్యామ్, వంశీ, విక్కి పాల్గొన్నారు.

సీపీఎం జెండా ఎగురవేయాలి



జనగామ రూరల్: మాట్లాడుతున్న కనకారెడ్డి



జఫర్‌గఢ్: సీపీఎంలో చేరిన వారితో నాయకులు

- జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి

జనగామ రూరల్ : స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజల పక్షాన పోరాడే సీపీఎం అభ్యర్థులను గెలిపించాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి అన్నారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో కన్నెబోయిన బాలరాజు అధ్యక్షతన మండల కమిటి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కనకారెడ్డి మాట్లాడుతూ.. గ్రామాల్లో స్థానికంగా ప్రజలు ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై నిరంతరం పోరాడే సీపీఎం అభ్యర్థులను ఎంపీటీసీ, సర్పంచ్‌లుగా గెలిపించాలని కోరారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ రెండు ఒక్కటేనని ఆయా పార్టీలకు స్థానిక ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో మండల కార్యదర్శి బోడ నరేందర్, పోత్కానూరి ఉపేందర్, బోడ రాములు, తాండ్ర ఆనందం, బండిరాజుల శ్రీరాములు, గుండెల్లి రాజు, సాంబరాజు, దుర్గాప్రసాద్, భైరగోని మల్లేశం, గట్టయ్య, కూరాకుల శ్రీను, మాదోజు రామసోక్కంతో పాటు తదితరులు పాల్గొన్నారు.

జఫర్‌గఢ్ : స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజల పక్షాన పోరాడే సీపీఎంను గెలిపించాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రాపర్తి రాజు, ఆర్.సోమయ్య కోరారు. మంగళవారం మండలంలోని కూనూర్ గ్రామానికి చెందిన మహిళలు, యువకులు సీపీఎంలో చేరారు. వారికి రాజు, సోమయ్య సీపీఎం కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సమాజంలో సగ భాగమైన మహిళలు రాజకీయంగా చైతన్యం కావాలన్నారు. తెలంగాణ సాయుధ పోరాట వీరవనితలు ఐలమ్మ, మల్లు స్వరాజ్యం స్ఫూర్తితో సమసమాజ స్థాపనకు పని చేయాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కూనూర్ గ్రామంలో సీపీఎం జెండాను ఎగురవేయాలని వారు కోరారు. రాయపురం భాగ్య, ఇల్లందుల జ్యోతి, రాయపురం ఎలీషా, రమ్య, చంద్రకళ, ఓరుగంటి రమ, సోడెం పద్మ, శాగ లక్ష్మి, అనుమాల విజయ, బైకాని కల్పన సకినాల రాజ్‌కుమార్, వెంకటేష్‌తో పాటు తదితరులు ఉన్నారు.

'రాష్ట్రీయ శైక్షిక్' సమావేశాల్లో జిల్లా ఉపాధ్యాయులు



అఖిల భారతీయ రాష్ట్రీయ శైక్షిక్ మహాసంఘ్ సమావేశంలో పాల్గొన్న ఉపాధ్యాయులు

జనగామ రూరల్ : అఖిల భారతీయ రాష్ట్రీయ శైక్షిక్ మహాసంఘ్, అఖిల భారతీయ కార్యనిర్వాహక సమావేశం ఈనెల 4న జైపూర్‌లోని జామ్‌డోలిలోని శ్రీ అగ్రసేన్ టీచర్ ట్రైనింగ్ కాలేజీలో నిర్వహించారు. ఈ సమావేశాలకు జిల్లా నుంచి తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం ఉపాధ్యాయులు పాల్గొన్నట్లు మంగళవారం వారు తెలిపారు. జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చల్ల తిరుపతిరెడ్డి, మల్లారెడ్డి, కాసర్ల రవి కుమార్, సుధీర్ బాబు, కిరణ్, కృతాత్మ మూర్తి, సతీశ్ బాబు పాల్గొన్నారు. విద్యారంగ, ఉపాధ్యాయుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని జిల్లా నుంచి పలు సమస్యలపై తీర్మానాలు చేశారని తెలిపారు.